

వట్టెం పంపింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న నాగం జనార్దన్‌రెడ్డి

# అవినీతి, అక్రమాలపై పోరాడుతాం

- ఇసుక అక్రమ రవాణాలో ఎమ్మెల్యే సంబంధీకులే..
- పైరవీల్లేకుండా ప్రజలకు మంచి చేయాలి
- హైడ్రాతో నష్టపోయిన పేదలను ఆదుకోవాలి
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి



మాట్లాడుతున్న నాగం

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో చోటుచేసుకున్న అక్రమాలు, అవినీతికి ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డిదే బాధ్యత అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత డాక్టర్ నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని కుమ్మెర శివారులో వర్షాలకు మునిగిపోయిన వట్టెం (వెంకటాద్రి) రిజర్వాయర్ పంప్‌హౌజ్‌ను సోమవారం సాయంత్రం ఆయన సందర్శించారు. టన్నెల్‌లోకి వెళ్లి పంప్‌హౌస్‌లో నీట మునిగిన మోటర్లను, అక్కడ జరుగుతున్న పనితీరును పరిశీలించి అధికారులతో మాట్లాడారు. అనంతరం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో నాగం మీడియాతో మాట్లాడారు. అక్రమ కల్లు దందా చేస్తున్న వ్యాపారీ ప్రస్తుతం తీహార్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడని తెలిపారు. కల్లులో నార్కోటిక్స్ కలుపుతూ.. విక్రయించడం దుర్మార్గమన్నారు. ఈ తంతంగం స్థానిక ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేకు తెలియకుండా జరుగుతుందని అనుకోవడం పొరపాటన్నారు. నియోజకవర్గంలో కల్తీకల్లు, డ్రగ్స్, గంజాయిని అరికట్టాలని డిమాండ్ చేశారు. చిన్నపిల్లలు గంజాయికి అలవాటు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎమ్మెల్యేగా ఉండగా.. నియోజకవర్గంలో ఇసుకను తరలించేందుకు ప్రజలు ట్రాక్టర్ కిరాయి, లేబర్ చార్జీలు మాత్రమే చెల్లించే వారన్నారు. ఇసుక విధానంతో ప్రభుత్వ ఖజానాకు ఎలాంటి లాభం చేకూరలేదన్నారు. ఇసుక అక్రమ రవాణాలో ఎమ్మెల్యే సంబంధీకులే ఉన్నట్లు తనకు సమాచారం ఉందన్నారు. ఇసుక తరలింపును ఒక్కరి చేతుల నుంచే నడిపించి ప్రజల నెత్తిన భారం వేస్తున్నారన్నారు. ఇసుక అక్రమాలపై ఎమ్మెల్యే సమీక్షకు రావాలన్నారు. నియోజకవర్గంలో చోటుచేసుకునే అవినీతి, అక్రమాలపై పోరాటం కొనసాగిస్తానన్నారు. వరి కొనుగోళ్ల టెండర్ల వ్యవహారం హైకోర్టు స్టే వరకు వెళ్లడం మంచిది కాదన్నారు. నాగర్‌కర్నూల్‌లో చెరువుల జోలికి వెళ్లడం కొందరికి బాధ కలిగించిందన్నారు. తన హయాంలో చెరువు నీళ్లు తాగేందుకు వీలుండేదని, నేడు మురుగంతా అందులో చేరుతుందని వాపోయారు. మున్సిపల్ అధికారులు స్పందించి మురుగు నీళ్లు చెరువులోకి చేరకుండా మళ్లించాలని సూచించారు. కల్తీకల్లు, గంజాయి నియోజకవర్గంలో ప్రమాదకరంగా మారిందని, అరికట్టకుంటే ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల హస్తం ఉందని భావించాల్సి వస్తుందన్నారు. ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి కార్యకర్తలకు పైరవీలు చేయడమే కాకుండా పనిచేయాలని హితవుపలికారు. హైడ్రాతో నష్టపోయిన పేదలు, చిరుద్యోగులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రవి, పాండు, లక్ష్మయ్య, బాలగౌడ్, లక్ష్మయ్య, రాజవర్ధన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, అర్జునయ్య, కుర్మయ్య, భీమయ్య, విష్ణుచారి, భీముడు, సత్యం, శంకర్, సుధాకర్, రాజు, అహ్మద్ పాల్గొన్నారు.



సమావేశంలో ఆవేదన వెల్లగక్కుతున్న అంధులు

# మమ్మల్ని బతకనివ్వరా?

- అన్నం పెట్టే నేతలపై ఆరోపణలా?
- మమ్మల్ని పలకరించని స్థానిక ఎమ్మెల్యే
- మాకు అండగా నిలిచింది మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాత్రమే..
- కంటతడి పెట్టుకున్న ఇండ్ల బాధితులు, బ్లయిండ్ అసోసియేషన్ నాయకులు

మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబర్ 16 : జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి తీరును పలువురు బీఆర్ఎస్ నాయకులు ఎండగట్టారు. పాలమూరులోని అభం.. శుభం తెలియని పేదల ఇండ్లను కూల్చిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు కాంగ్రెస్ కార్యకర్తలతో ఆరోపణలు చేయిస్తున్నారని నాయకులు రాజేశ్వర్‌గౌడ్, వెంకన్న ధ్వజమెత్తారు. ఈ సమయంలో పలువురు ఇండ్లు కోల్పోయిన, బ్లయిండ్ అసోసియేషన్ నాయకులు అక్కడకు చేరుకొని ఆవేదన వ్యక్తం చేశారు. పింఛన్ డబ్బును జమ చేసి ఇల్లు కట్టుకుంటే.. కూల్చేశారని బ్లయిండ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రంగదాస్ వాపోయాడు. నేటి వరకు కూడా స్థానిక ఎమ్మెల్యే కనీసం తమను పలకరించేందుకు కూడా రాలేదన్నారు. ఇండ్లు కూలి రోడ్డున పడిన మా పరిస్థితి చూసి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నిత్యావసర సరుకులు అందించి తమను ఆదుకున్నారని తెలిపారు. గూడు, గుడ్డలేని తమకు తినడానికి బుక్కెడు అన్నం పెడుతున్నాడన్న సంతోషంలో బతుకుతున్నామన్నారు. అయితే తింటున్న కంచాన్ని ఎమ్మెల్యే లాగేలా వ్యవహరిస్తున్నారని, కడుపునింపుతున్న నేతలపై ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశాడు. పట్టించుకోకుంటే కలెక్టరేట్, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట ఆత్మహత్య చేసుకునే పరిస్థితి కూడా వస్తదని హెచ్చరించారు. అనంతరం బ్లయిండ్ అసోసియేషన్ నాయకుడు మల్లయ్య మాట్లాడుతూ 2013-14లో ఇంటర్ పూర్తి చేసి ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న తరుణంలో నా ఇల్లు కూల్చారు. అందులో నేను చదివిన సర్టిఫికెట్లు ఉండగా.. మట్టిలో కలిసిపోయాయి. ఇప్పుడు నేను చదివిన చదువు, ఉండడానికి ఇల్లు లేదు. నేను బతికి ఏం లాభమని బోరున విలపించాడు. నాకు ఇల్లు కట్టించడంతోపాటు ఉద్యోగం ఇప్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే నాకు చావే శరణ్యమని వాపోయాడు.

వీపనగండ్ల మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 75మంది విద్యార్థులు చేరారు. వీరికి అదనంగా ద్వితీయ సంవత్సర విద్యార్థులు మరో 70మంది వరకు ఉన్నారు. ఇలా అన్ని గ్రూపులకు కలిపి 145 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. అయితే, జూలై ఒకటిన కళాశాలలు తెరుచుకున్నాయి. ఈ లెక్కన మూడు నెలలవుతున్నా.. లెక్చరర్లు లేక ఇంగ్లిష్ పుస్తకం తెరుచుకోలేదు.

వనపర్తి జిల్లాలో 12 జూనియర్ కళాశాలలు కొనసాగుతున్నాయి. వీటిలో ఈ ఏడాది మొదటి సంవత్సరంలో దాదాపు 1,753 మంది అడ్మిషన్లు తీసుకున్నారు. వీరికి అదనంగా ద్వితీయ సంవత్సరానికి చెందిన మరో 1,500 మంది విద్యార్థులు చదువుతున్నారు. గురుకులాల ఏర్పాటుతో వీటికి ప్రాధాన్యం తగ్గిందన్న భావన ఉన్నది. అయితే, కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కాంట్రాక్ట్ లెక్చరర్స్‌ను రెగ్యులర్ చేసి కొంత ఊరటనిచ్చారు. అయినప్పటికీ కళాశాలల్లో ఇంకా కొన్ని సబ్జెక్టులకు అధ్యాపకులను నియమించలేదు. ఇందుకు గెస్ట్ లెక్చరర్ పేరుతో అధ్యాపకులు లేని సబ్జెక్టులకు ప్రభుత్వ అనుమతుల ద్వారా అభ్యర్థులను తీసుకొని బోధన చేస్తూ వస్తున్నారు. ఇది ఈ ఏడాది ఇంకా అమలుకు నోచుకోకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉన్నది.

గోపాల్‌పేట ఇంటర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 68 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. సెకండియర్‌లో 65 మంది ఉన్నారు. ఇలా నాలుగు గ్రూపుల్లో కలిపి 132మంది ఉన్నారు. అయితే, ఇక్కడ కూడా తెలుగు, ఇంగ్లిష్ అధ్యాపకులు కరువయ్యారు.



వనపర్తి ఇంటర్మీడియట్ విద్యా అధికారి కార్యాలయం

# కాలేజీలకు గెస్ట్‌లొచ్చేనా?

## ఇరకాటంలో ఇంటర్ విద్య

- వనపర్తి జిల్లాలో 64 గెస్ట్ లెక్చరర్ పోస్టులు ఖాళీ
- సర్కారు అనుమతుల కోసం నిరీక్షణ
- విద్యాబోధనకు నోచుకోని విద్యార్థులు
- మూడ్నెళ్లయినా తెరుచుకోని పుస్తకాలు
- ఐదు కళాశాలలకూ ఇన్‌చార్జి ప్రిన్సిపాళ్లే దిక్కు!

వనపర్తి, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : వనపర్తి జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు ఇరకాటంలో పడ్డారు. కళాశాలలు తెరుచుకొని మూడు నెలలైనా.. వివిధ సబ్జెక్టులకు అధ్యాపకులు లేక విద్యార్థులు బోధనకు నోచుకోవడంలేదు. కొన్ని కళాశాలల్లో ఇంగ్లిష్ పుస్తకమే తెరుచుకోలేదు. సర్కార్ కళాశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న నిరుపేద విద్యార్థులకు దిక్కూమొక్కు లేకుండాపోయింది.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వివిధ సబ్జెక్టులకు సంబంధించి 64పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో గతేడాదిలోనూ గెస్ట్ లెక్చరర్స్ పనిచేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈపాటికే ఖాళీలను భర్తీ చేసి బోధనలు ప్రారంభించాల్సి ఉంది. కాలేజీలు తెరచుకుని మూడు నెలలు గడిచినా ఇప్పటి వరకు ఉలుకూపలుకు లేదు. దీంతో నిరుపేద విద్యార్థులంతా లెక్చరర్స్ లేని సబ్జెక్టుల్లో వెనుకబాటుకు గురవుతున్నారు. ఒక్కో కళాశాలలో ఒక్కో సబ్జెక్టు వారీగా ఖాళీలున్నాయి. వీటిలో కొన్ని కళాశాలల్లో ఇంగ్లిష్‌కు కూడా లెక్చరర్స్ లేకపోవడంతో ఇప్పటివరకు పుస్తకమే తెరువలేదు. మరికొన్ని చోట్ల తెలుగు, కెమెస్ట్రీ, మాథ్స్ వంటివి కూడా బోధించడం లేదంటే విద్యార్థులు ఎలా ఉత్తీర్ణత సాధిస్తారన్నది ప్రశ్నార్థకంగా మిగులుతుంది.

**ప్రిన్సిపాళ్లు కరువే..**

జిల్లాలోని 12 కళాశాలలకుగానూ అయిదు కళాశాలలకు ఇన్‌చార్జి ప్రిన్సిపాళ్లు కొనసాగుతున్నారు. వీరిలో ఒక్కొక్కరికి రెండు కళాశాలలను అప్పగించడంతో పర్యవేక్షణ లేకుండా పోయింది. ఇన్‌చార్జీలుగా బాధ్యతలు తీసుకున్నారే తప్పా కళాశాలలకు వెళ్లడం లేదు. ఇప్పటి వరకు ఒకటి, రెండు దఫాలు మాత్రమే కాలేజీలకు వెళ్లినట్లు సమాచారం. అదికూడా డీఐవో వచ్చినప్పుడో.. కళాశాల ఫేర్‌వెల్ ప్రోగ్రాం పెట్టినప్పుడో తప్పా కళాశాల పర్యవేక్షణకు మాత్రం రావడం లేదన్న వాదనలున్నాయి. ఇప్పుడున్న ప్రిన్సిపాళ్లలో కొందరు హైదరాబాద్ నుంచి రోజువారీ రాకపోకలు సాగిస్తున్నారు. ఇక వీరి ప్రయాణానికి సమయం సరిపోదని, ఇక కళశాలలకు ఎలా న్యాయం చేస్తారన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. ఆత్మకూరు, పెద్దమందడి, వీపనగండ్ల, శ్రీరంగాపురం, పాన్‌గల్ కాలేజీలకు ఇన్‌చార్జి ప్రిన్సిపాళ్లే ఉన్నారు.

### ఏం చదవాలి.. ఎలా రాయాలి



కళాశాలలు తెరచి మూడు నెలలైంది. గెస్ట్ లెక్చరర్స్ రావడానికి ఇంకా ఎన్ని రోజులు పడుతుందో. మా కాలేజీలో తెలుగు, ఇంగ్లిష్ బోధించడంలేదు. మరికొంత సమయం గడిస్తే పరీక్షలు కూడా వస్తాయి. ఏం చదవాలి.. ఎలా రాయాలి. ప్రభుత్వం స్పందించి అధ్యాపకులను నియమించాలి.

*- అర్చన, ఇంటర్ మొదటి సంవత్సరం, గోపాల్‌పేట*

### రెండు సబ్జెక్టులకు లేరు..



మా కాలేజీలో తెలుగు, ఇంగ్లిష్‌కు అధ్యాపకులు లేరు. ఇప్పటి వరకు ఈ సబ్జెక్టుల వైపు చూడడం లేదు. అధ్యాపకులు వచ్చేదెప్పుడో.. మాకు చెప్పేదెప్పోడో అర్థం కావడం లేదు. నెలలు గడుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ కళాశాలలపై శ్రద్ధ లేనందునే ఇలా వదిలేశారు. లేట్‌గా వచ్చి చెప్పినా.. ముందు నుంచి చెప్పినట్లుగా ఉండదు. ఈ ప్రభావం ఫలితాలపై పడుతోంది.

*- విక్రమ్, ఇంటర్ ద్వితీయ సంవత్సరం, గోపాల్‌పేట*

### ఇంగ్లిష్ చెప్పడం లేదు..



మాకు ఇంత వరకు ఇంగ్లిష్‌లో బోధించడంలేదు. లెక్చరర్ లేదని చెబుతున్నారు. ఇప్పటికే చాలా రోజులైంది. ఇంకా రావడం లేదు. ఇంగ్లిష్ సబ్జెక్టును మొదలు పెట్టకపోతే, పరీక్షలు ఎలా రాస్తాం. హడావుడిగా వచ్చి చెప్పినా మాకు అర్థకావడం కష్టం. ముందు నుంచి తరగతులు జరిగితే, ఆ ప్రభావం వేరేలా ఉంటుంది. త్వరగా ఇంగ్లిష్ బోధన మొదలు పెట్టాలి.

*- గడ్డమీది బున్ని, ప్రథమ సంవత్సరం, వీపనగండ్ల*

### త్వరలోనే అనుమతులు..



గెస్ట్ లెక్చరర్స్‌ను తీసుకునేందుకు త్వరలోనే అనుమతులు రాబోతున్నాయి. ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉండింది. కొన్నిచోట్ల గతంలో పని చేసినవారు బోధిస్తుండడంతో ఇబ్బంది లేదు. మరి కొన్నిచోట్ల మాత్రమే సమస్య ఉంది. త్వరలోనే పరిష్కారమతుందని ఆశిస్తున్నాం. విద్యార్థులకు నష్టం జరగనివ్వం. అనుమతులు రాగానే నిబంధనల మేర భర్తీ చేస్తాం.

*- అంజయ్య, డీఐవో, వనపర్తి*

# అతిథిలకు ఉద్యోగ భద్రతేదీ?

- జేఎల్ రిక్రూట్‌మెంట్‌తో బజారున పడ్డ బతుకులు
- క్రమబద్ధీకరణ కోసం తప్పని ఎదురుచూపులు
- రెగ్యులర్ లెక్చరర్లతో సమానంగా విధులు
- అయినా సకాలంలో అందని వేతనాలు
- మనోవేదనకు గురవుతున్న గెస్ట్ లెక్చరర్లు




కొత్తగా ఏర్పాటు చేసిన మహ్మదాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబర్ 16 : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకుల కొరత వేధిస్తోంది. సింహభాగం ఒప్పంద, అతిథి గురువులతోనే తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రధానాచార్యుల నుంచి అధికారి స్థాయి వరకు చాలాచోట్ల ఇన్‌చార్జీలే కొనసాగుతున్నారు. కళాశాలల్లో అధ్యాపకుల కొరత ఉండడంతో గెస్ట్ లెక్చరర్లు వారులేని లోటును భర్తీ చేస్తున్నారు. కొన్ని కళాశాలలకు పోస్టులు మంజూరు లేకపోవడం, ఇంకొన్నిచోట్ల బోధకుల కొరతతో తెలుగు, ఆంగ్ల మాధ్యమం కలిపి బోధిస్తున్న పరిస్థితి. రెగ్యూలర్ లెక్చరర్లతో సమానంగా విధులు నిర్వహిస్తున్న తమను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని గెస్ట్ లెక్చరర్లు కోరుతున్నారు. పీహెచ్‌డీలు, పీజీలు చేసి రెగ్యులర్ ఉద్యోగం దొరక్క.. చాలీచాలనీ వేతనాలతో కుటుంబాలను పోషించుకుంటున్నామని మనోవేదనకు గురుతున్నారు.

ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొత్తం 61 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. వీటి పరిధిలో మహబూబ్‌నగర్ జిల్లాలో 71మంది, నాగర్‌కర్నూల్-73, వనపర్తి-56, నారాయణపేట-44, జోగుళాంబ-గద్వాల జిల్లాలో 41మంది గతేడాది పనిచేశారు. వారిని విధుల్లోకి తీసుకోవాలని ఆయా జిల్లాల అధికారులు ప్రభుత్వాన్ని కోరడంతో ఈనెల 3వ తేదీన (విద్యా సంవత్సరం ప్రారంభమైన మూడు నెలలు పూర్తయిన తర్వాత) విధుల్లోకి తీసుకుంటున్నట్లు ప్రొసీడింగ్ జారీ చేసినా.. అతిథి అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కరవైంది. పనిగంటల విధానంలోనే వేతనాలు చెల్లిస్తుండడం, అవికూడా సకాలంలో అందించకపోవడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు. కొత్తగా జేఎల్ రిక్రూట్‌మెంట్ కానుండడంతో నిత్యం భయం భయంగా బతుకులీడుస్తున్నారు.

మహబూబ్‌నగర్ జిల్లాలో 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా ఈ ఏడాది కొత్తగా సీసీకుంట, మహ్మదాబాద్‌లోనూ జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొత్తం 278 జూనియర్ లెక్షరర్ పోస్టులు ఉండగా.. 164 భర్తీ చేయగా.. 113 ఖాళీగా ఉన్నాయి. కొత్తగా ఏర్పాటు చేసిన మహ్మదాబాద్‌లో 75 మంది, సీసీకుంటలో 55 విద్యార్థులు ప్రవేశాలు పొందారు. కొత్త కళాశాలల్లో 12 మంది చొప్పున అధ్యాపకుల అవసరం ఉంది. కానీ ఒక్కరు కూడా అందుబాటులో లేరంటే అతిశయోక్తికాదు.

### సూపర్ న్యూమరీ పోస్టులు క్రియేట్ చేయాలి



రాష్ట్రవ్యాప్తంగా 1,654 మంది ఉన్నారు. అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలి. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చినట్లు రూ.42వేలు వేతనం ఇవ్వాలి. ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ మంత్రులు సూపర్ న్యూమరీ పోస్టులు సృష్టించి న్యాయం చేయాలి. మరోవైపు వేతనాలు రాక కుటుంబాల పోషణ భారంగా మారింది. జూన్, జూలైలో పనిచేసిన కాలానికి వేతనాలు ఇవ్వాలి.

*- టీ సురేందర్‌రెడ్డి, మహబూబ్‌నగర్*

### మనోవేదనతో చిన్నాభిన్నం..



ఏటా సకాలంలో గెస్ట్ లెక్చరర్లను రెన్యూవల్ చేయాలి. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఒక అధ్యాపకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మనోవేదనతో కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయి. ప్రభుత్వం విద్యా సంస్థను బలోపేతం చేస్తుందని చెబుతున్నా.. కొందరు కార్పోరేట్‌కు సహకారం అందిస్తున్నారు. ఎంఏ బీఈడీ, ఎంఫిల్, పీహెచ్‌డీ రీసెర్చ్ స్కాలర్‌ను. 12ఏండ్లుగా ఈ వృత్తిలో కొనసాగుతున్నా. ఉద్యోగ భద్రత కల్పించి మమ్మల్ని, కుటుంబాల్ని ఆదుకోవాలి.

*- కావలి కృష్ణ, నాగర్‌కర్నూల్*

### ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి..



ఎన్నికల సమయంలో క్రమబద్ధీకరిస్తామని రాహుల్ గాంధీ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. జేఎల్ రిక్రూట్‌మెంట్ కొనసాగుతున్నది. నిరుద్యోగులను ఉద్యోగులుగా మారుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం మమ్మల్ని నిరుద్యోగులను చేయొద్దు. ఉద్యోగభద్రత కల్పించాలి.

*- స్వర్ణలత, కొల్లాపూర్*



వనపర్తి జిల్లా కేంద్రంలో వినాయక విగ్రహం ఎదుట చిన్నారుల డ్యాన్సులు, జడ్చర్ల నాగసాల చెరువులో గణనాథుడి నిమజ్జనం





మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మహిళల కోలాటాలు

# గంగ చెంతకు గణేశుడు

పది రోజులపాటు భక్తులతో విశేషంగా పూజలందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరాడు. కోలాటాలు, భజనలు, డీజే చప్పుళ్లు, నృత్యాల మధ్య వినాయకుడి ప్రతిమలను వాడవాడలా ఊరేగించారు.
















